సాక్షి రంగారెడ్డి

శనివారం : 3 : మే : 2025



భవనాలు ఆకాశంలోకి..

గ్రేటర్ పరిధిలో హైరైజ్ భవనాల ఎత్తు పెరుగుతున్న కొద్దీ.. భూగర్భ జలాలు పాతాళానికి జారుతున్నాయి. 10లో



ఒక్కొక్కరికి రెండు జతలు

రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం రోజేనే విద్యార్థులకు యూనిఫాం అందించాలని విద్యాశాఖ భావిస్తోంది. 10లో



అక్రమంగా గోవుల తరలింపు

కంటైనర్‌లో అక్రమంగా గోవులు తరలిస్తుండగా బీజేపీ నాయకులు వాటిని గోశాలకు తరలించారు. 10లో

న్యూస్‌రీల్

రూ.40 కోట్ల ప్రభుత్వ భూమికి విముక్తి



ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ముప్పై ఏళ్ల క్రితమే కబ్జాకు గురైన రూ.40 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు మూడు రోజుల క్రితం విముక్తి కల్పించారు. ఇప్పటికే రెండుసార్లు సర్వే చేయడంతో పాటు భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సరూర్‌నగర్ మండలం లింగోజిగూడ డివిజన్ సర్వే నంబర్ 86లో 1.21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఓ పార్టీకి చెందిన నేత దీనిపై కన్నేశాడు. పక్కనే ఉన్న ప్రైవేటు పట్టాదారును ఉసిగొల్పి ప్రభుత్వ భూమిని పట్టా భూమిలో కలిపేందుకు యత్నించాడు. ఇప్పటికే ఆ భూమిలో నాలుగు తాత్కాలిక గదులు నిర్మించి కూలీలకు అద్దెకిచ్చాడు. ఇతరులెవరినీ లోనికి అడుగు పెట్టకుండా ప్రైవేటు సెక్యూరిటీతో నిఘా ఏర్పాటు చేశాడు. ఖాళీ స్థలాన్ని తన సొంత స్థలంగా నమ్మించి అందులో ప్రైవేటు కార్లు, బస్సులు, ఇతర భారీ వాహనాల పార్కింగ్ కోసం అద్దెకిచ్చాడు. విషయం రెవెన్యూ అధికారులకు తెలిసింది. ఏళ్లుగా ప్రైవేటు వ్యక్తి చెరలో చిక్కిన ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించాలని నిర్ణయించారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్ క్షేత్రస్థాయికి చేరుకుని భూమిని పరిశీలించారు. నాలుగు నెలల్లో మూడుసార్లు పరిశీలించడంతోపాటు పక్కాగా సర్వే చేయించారు. మూడు రోజుల క్రితం చుట్టూ హద్దురాళ్లను ఏర్పాటు చేయడంతో పాటు ఫెన్సింగ్ వేయించారు. తాత్కాలిక గదుల్లో అద్దెకున్న వారంతా వారం రోజుల్లో ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిందిగా ఆదేశించారు. లేదంటే ఆ నివాసాలను కూల్చివేయనున్నట్లు హెచ్చరించారు. ఇదే భూమికి సమీపంలో ఉన్న మరో 250 గజాల స్థలాన్ని కూడా అధికారులు రక్షించారు.

చీఫ్ సెక్రటరీకి శుభాకాంక్షలు



చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధానకార్యదర్శిగా నియమితులైన రామకృష్ణరావును రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి కలిశారు. నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో శుక్రవారం చీఫ్ సెక్రటరీని మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


రికార్డు 'ఎర్లీబర్డ్'.. రూ. 900.93 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎర్లీబర్డ్ పథకంతో రికార్డు స్థాయిలో రూ.900.93 కోట్ల ఆస్తిపన్ను వసూలైనట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. ఈ పథకంతో గత సంవత్సరం రూ. 831.23 కోట్లు వసూలు కాగా, ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువ వసూలైనట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లోనే ఏడాది ఆస్తి పన్నును చెల్లించేవారికి 5 శాతం రాయితీ ఇవ్వడమే 'ఎర్లీబర్డ్' పథకం. 7,93,552 మంది ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. ఎర్లీబర్డ్ ద్వారా ఆస్తి పన్ను వసూళ్లు ఏటికేడు పెరుగుతోంది. 2023–24లో రూ.785.94 కోట్లు, 2024–25లో రూ.831.23 కోట్లు, 2025–26లో రూ. 900.93 కోట్లు ఆదాయం సమకూరింది.

విదేశీ వన్యప్రాణి

ముచ్చర్లలో అన్యదేశ జంతు ప్రదర్శనశాల





200 ఎకరాల్లో ఎగ్జోటిక్ జూ పార్కు

- సింగపూర్ తరహాలో రూపుదిద్దే యోచన
- ఇప్పటికే స్థలం కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- పీపీపీ విధానంలో పనులు ప్రారంభించనున్న టీఎఫ్‌డీసీ
- మరో రెండేళ్లలో అందుబాటులోకి..

విదేశీ జంతు జాతులను కనులారా చూసి ఆనందించాలని ఉందా? వేరే దేశంలోనో, దూర ప్రాంతాలకు వెళ్లో ఈ వన్యప్రాణులను చూసి రావటం అసాధ్యమని భావిస్తున్నారా? అయితే.. మీరు ఏమాత్రం చింతించనవసరంలేదు. రెండేళ్లు ఆగితే మన వద్దే ఎగ్జోటిక్ జూ పార్కు (విదేశీ జంతు ప్రదర్శన శాల) అందుబాటులోకి వచ్చే అవకాశముంది. నగర శివారులోని ముచ్చర్లలో ఇది ఏర్పాటు కానుంది. 200 ఎకరాల్లో విదేశీ (అన్యజాతి) జంతు ప్రదర్శనశాల సందర్శకులకు కనువిందు చేయనుంది. సింగపూర్ జూ తరహాలో దీనిని రూపుదిద్దనున్నారు. పీపీపీ పద్ధతిలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ జూ పార్కును ఏర్పాటు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం స్థలం కేటాయించింది. ప్రపంచంలోని ఇతర దేశాలకు చెందిన జంతువులను మాత్రమే ఇక్కడ ఉంచుతారు. ఇతర జూ పార్కులతో పాటు పెద్ద పెద్ద ఫామ్స్‌లలో పెంపకం చేపట్టే వారి వద్ద నుంచి వివిధ రకాల జంతువులను ఇక్కడికి తరలించి సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నారు. రానున్న రెండేళ్లలో ఈ ఎగ్జోటిక్ యానిమల్ జూ పార్కు అందుబాటులోకి రానుంది.

– చార్మినార్

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలకు తోడు నాలుగో సిటీగా ఏర్పడనున్న ఫ్యూచర్ సిటీకి దగ్గరల్లో విదేశీ జంతు ప్రదర్శన శాల అందుబాటులోకి రానుంది. పాతబస్తీ చాంద్రాయణగుట్ట మీదుగా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కలుపుతూ ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు కారిడార్ ఎక్స్‌టెన్షన్ ఏర్పాటు కానున్న దృష్ట్యా కొత్తగా ఏర్పడనున్న ఈ జూ పార్కుకు రోడ్డు మార్గంతో పాటు మెట్రో రైలు సేవలు కూడా అందుబాటులో ఉండనున్నాయి. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్)తో పాటు రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) తదితర అత్యంత సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. ఈ జూ పార్కుతో పాటు మరో 1,500 ఎకరాల అటవీ ప్రాంతాన్ని జూ సఫారీ పార్కు ఏర్పాటు చేయడానికి అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా.. ప్రస్తుతం 380 ఎకరాల్లో 2,200 జంతువులతో కొనసాగుతున్న నెహ్రూ జూ పార్కుకు అదనంగా ఈ విదేశీ జంతు ప్రదర్శన శాల అందుబాటులోకి రానుంది.

ఏయే దేశాల నుంచి..

ఆఫ్రికా, దక్షిణ అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన జంతు జాతులను ఎగ్జోటిక్ యానిమల్ జూ పార్కుకు తరలించనున్నారు. నెహ్రూ జూ పార్కులోని జంతువులు అక్కడే ఉండనున్నాయి. ఒకవేళ ఇప్పటికే ఇక్కడ ఉన్న విదేశీ జంతువుల సంతానం పెరిగితే వాటిని మాత్రమే అక్కడికి తరలించనున్నారు. జంతు మార్పిడిలో భాగంగా ఇతర దేశాల్లోని జూ పార్కుల నుంచి అవసరమైన జంతు జాతులను కొత్త జూ పార్కుకు తరలించనున్నారు. అలాగే.. ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫామ్స్ నుంచి జంతువులను ఖరీదు చేసి ఇక్కడికి తీసుకురానున్నారు. నెహ్రూ జూ పార్కులో కొనసాగుతున్న ప్రస్తుత జంతు సేకరణకు భిన్నంగా ఈ ప్రక్రియ కొనసాగనుంది.

దేశంలోనే అతిపెద్దగా..

200 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఎగ్జోటిక్ యానిమల్ జూ పార్కు దేశంలో అతి పెద్దది కానుందని జూ పార్కు అధికారులు తెలిపారు. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని శ్రీ చామరాజేంద్ర జంతు ప్రదర్శన శాల (మైసూర్ జూ)లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇతర దేశాల జంతువులకు ఆవాసంగా కొనసాగుతోంది. అంతరించిపోతున్న జంతు జాతుల పరిరక్షణ జరుగుతోంది. దీనికి తోడు ఆదాయంతో పాటు సందర్శకులకు వినోదం లభిస్తోంది. ఈ తరహాలోనే నగర శివారు ముచ్చర్లలో విదేశీ జంతు ప్రదర్శన శాల ఏర్పాటు కానుంది. అయితే ముచ్చర్ల జూ పార్కు మైసూర్ జూ పార్కు కన్నా.. విశాలంగా ఏర్పాటు కానుంది.

పనులు చకచకా..



విదేశీ జంతు ప్రదర్శన శాల ఏర్పాటుకు పనులు చకచకా జరుగుతున్నాయి. ముచ్చర్లలో ఈ జూ పార్కు రూపుదిద్దుకోనుంది. దీంతో పాటు అక్కడే దాదాపు 1,500 ఎకరాల అటవీ స్థలాన్ని సైతం సఫారీ పార్కుకు కోసం పరిశీలిస్తున్నాం. రానున్న రెండేళ్లలో కొత్త జూ పార్కు సందర్శకులకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

– డాక్టర్ సునీల్ ఎస్.హీరేమత్, డైరెక్టర్, తెలంగాణ జూ పార్క్స్



నాలుగు గంటలపాటు అఘోరీ విచారణ

- ఒకరోజు కస్టడీకి తీసుకున్న మోకిల పోలీసులు
- ప్రగతి రిసార్ట్స్‌లో గంటన్నర పాటు సీన్ రికన్‌స్ట్రక్షన్
- అనంతరం షాద్‌నగర్ కోర్టుకు..
- అక్కడి నుంచి చంచల్‌గూడ జైలుకు



అఘోరీని షాద్‌నగర్ కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

శంకర్‌పల్లి/షాద్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అఘోరీ అలియాస్ శ్రీనివాస్‌ని శుక్రవారం మోకిల పోలీసులు విచారించారు. మంచిర్యాల జిల్లా కృష్ణపల్లికి చెందిన అఘోరి శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులోని ప్రగతి రిసార్ట్‌లో నివసించే ఓ మహిళా సినీ నిర్మాతను పూజల పేరుతో మోసి చేసి, చంపుతానని బెదిరించి రూ.9.80 లక్షలు వసూలు చేసిన వ్యవహారంలో ఫిబ్రవరి 25న మోకిల పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గత నెల 22న ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. 23న చేవెళ్ల జూనియర్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. అప్పటి నుంచి చంచల్‌గూడ జైలులో ఉన్న అఘోరీని మూడు రోజుల కస్టడీకి అనుమతించాలని మోకిల పోలీసులు చేవెళ్ల కోర్టులో పిటిషన్ వేయగా.. కోర్టు ఒకరోజు కస్టడీకి అనుమతించింది.

ప్రశ్నల పరంపర..

కోర్టు ఒకరోజు మాత్రమే అనుమతి ఇవ్వడంతో అఘోరి పోలీస్‌స్టేషన్‌కి వస్తున్న విషయం, సీన్ రీకన్‌స్ట్రక్షన్, రిమాండ్ తరలింపు తదితర విషయాలను చివరి నిమిషం వరకు పోలీసులు గోప్యంగా ఉంచారు. మోకిల సీఐ వీరబాబు సుమారు నాలుగు గంటల పాటు అఘోరిని విచారించారు. ప్రగతి రిసార్ట్స్‌లో నివసించే మహిళా సినీ నిర్మాత ఎలా పరిచయం అయ్యారు? మొదటిసారి ఎక్కడ కలుసుకున్నారు? ఎన్ని రోజులు వాళ్లతో ఉన్నావు? పూజలు ఎక్కడ చేశారు? ఆమె వద్ద నుంచి ఎన్ని లక్షలు తీసుకున్నావు? తీసుకున్న డబ్బుతో ఏం కొనుగోలు చేశావ్? మిగిలిన డబ్బు ఇప్పుడు ఎక్కడుంది? ఇవన్నీ ఎందుకు చేస్తున్నావు? నీ వెనకాల ఎవరన్నా ఉండి చేయిస్తున్నారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. అడిగిన ప్రశ్నలకు అఘోరీ ఓపిగ్గా సమాధానం చెబుతూ సహకరించినట్లు పోలీసులు తెలిపారు.

షాద్‌నగర్ కోర్టుకు అఘోరీ

సుమారు నాలుగు గంటల పాటు మోకిల ఠాణాలో అఘోరీని విచారించిన పోలీసులు సీన్ రికన్‌స్ట్రక్షన్ కోసం ప్రగతి రిసార్ట్స్‌కి తీసుకెళ్లారు. అక్కడ పూజలు, తదితర అంశాలపై గంటన్నర పాటు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించారు. కస్టడీ సమయం ముగిసిన అనంతరం చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టాల్సి ఉండగా జడ్జి సెలవులో ఉండడంతో షాద్‌నగర్ కోర్టుకు తీసుకొచ్చి జడ్జి ఎదుట హాజరుపరిచారు. అఘోరీ తరపు న్యాయవాదులు బెయిల్ పిటీషన్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. బెయిల్ పిటీషన్‌ను సోమవారానికి జడ్జి వాయిదా వేసినట్లు అఘోరీ తరపు న్యాయవాది కుమార్ తెలిపారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు పోలీసులు అఘోరీని చంచల్‌గూడ జైలుకి తరలించారు.

విద్యుత్ మీటర్ల కొను'గోలుమాల్'



ఓ ఇంట్లో నిల్వ ఉంచిన విద్యుత్ మీటర్లు

ధ్రువీకరణ పత్రాలు, నిర్మాణాలు లేకపోయినా జారీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ మీటర్ల జారీ వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. ఎలాంటి నిర్మాణాలు, భూమికి సంబంధించిన రికార్డులు లేకపోయినా క్షేత్రస్థాయి సిబ్బందికి అడిగినంత ఇస్తే చాలు మీటర్లు జారీ చేయిస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికే కాదు.. ఆయా భూముల్లో అక్రమ నిర్మాణాలకు కారణమవుతున్నారు. ఇప్పటికే సరూర్‌నగర్ సర్కిల్ మునగనూరు సర్వే నంబర్ 90లో 6.28 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, 54 తాత్కాలిక ఇళ్లను నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణాలకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ మీటర్లు మంజూరు చేయడంతో స్థానికంగా ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా, విద్యుత్‌శాఖ అధికారులకు నోటీసులు జారీ చేసింది. తాజాగా దుండిగల్, రాయదుర్గం పోలీసు స్టేషన్ల పరిధిలోనూ పెద్ద సంఖ్యలో విద్యుత్‌మీటర్లు బయట పడటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డిస్కం రిలీజ్ చేసిన 24 గంటల్లోనే సంబంధిత దరఖాస్తుదారు నివాస గృహం/వాణిజ్య భవనానికి క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో నెలలు గడుస్తున్నా అమర్చడం లేదు. కానీ.. మరుసటి నెల నుంచే ఆయా మీటర్లకు రీడింగ్ నమోదు చేసినట్లు రికార్డులు చూపిస్తూ ప్రతి నెలా మినిమం బిల్లులు జారీ చేస్తున్నారు.

అక్రమంగా 42 విద్యుత్ మీటర్లు..

ఇంట్లో అక్రమంగా దాచిన 42 విద్యుత్ మీటర్లను విద్యుత్ శాఖ అధికారుల ఫిర్యాదుపై రాయదుర్గం పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకొని కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేశారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 24 గంటల్లో ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ మీటర్లు ఇంట్లో అక్రమంగా దాచి ఉంచారని విద్యుత్ శాఖలోని సైబర్ సిటీ జోన్ ఇబ్రహీంబాగ్ డివిజన్ ఏడీఈ అంబేడ్కర్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు చిత్రపురి కాలనీలోని ఓ ఇంట్లో తనిఖీలు చేయగా 42 విద్యుత్ మీటర్లు దొరికాయి. కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డిపై కేసు నమోదు చేశారు. మీటర్లు నిల్వ ఉంచడంపై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్ ప్రకటించారు.

రిజిస్ట్రేషన్.. నో టెన్షన్

- మరింత సులభతరంగా స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం
- పది నుంచి పదిహేను నిమిషాల్లోనే పూర్తి కానున్న ప్రక్రియ
- జిల్లాలో ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి కార్యాలయాల ఎంపిక
- ఈనెల 12 నుంచి ప్రయోగాత్మకంగా అమలు



షాద్‌నగర్‌లోని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయం

షాద్‌నగర్: స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సులభం కానుంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజుల నమోదు కోసం గంటల తరబడి నిరీక్షించే అవసరం ఉండదు. పది నుంచి 15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తి కానుంది. ఇందుకు గాను రిజిస్ట్రేషన్ల శాఖ సంస్కరణలు చేపట్టింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ విధానాన్ని అమలు చేసేందుకు జిల్లాలోని ఐదు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఎంపిక చేశారు.

రెండో విడతలో భాగంగా..

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి మంచి స్పందన వచ్చింది. విడతల వారీగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈనెల 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు. రెండో విడతలో భాగంగా జిల్లాలోని ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతలో శంషాబాద్, సరూర్‌నగర్, చంపాపేట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎంపిక కావడంతో అక్కడ ఇప్పటికే స్లాట్‌బుకింగ్ విధానం కొనసాగుతోంది.

అనుకున్న సమయానికి ..

దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం అనుకున్న సమయానికి, తేదీకి, ఆన్‌లైన్‌లోనే స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, ఆ తర్వాత 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ చేసుకున్న సమయానికి కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని వెళ్లిపోవచ్చు.

స్వయంగా దస్తావేజుల తయారీ

స్థిరాస్తి దస్తావేజులు నమోదు చేసుకునే వారు డాక్యుమెంట్ రైటర్లపై ఆధారపడకుండా స్వయంగా తయారు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో ప్రత్యేక మాడ్యూల్ ప్రవేశపెట్టారు. మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసం వెసులుబాటు ఉంది. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజుపై అమ్మినవారు, కొన్నవారు, సాక్షులు తర్వాత సబ్‌రిజిస్ట్రార్ సంతకాలు చేయడం, వాటిని స్కానింగ్ చేయడానికి సుమారు గంట సమయం పడుతుంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో జరిగే జాప్యాన్ని నివారించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ చార్ట్‌బోర్డ్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు.

మరింత సరళతరం

స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సరళతరం కానుంది. ప్రజలకు సులభంగా, వేగంగా, పారదర్శకంగా సేవలు అందుతాయి. రిజిస్ట్రేషన్ కోసం అనుకున్న సమయానికి స్లాట్‌బుకింగ్ చేసుకోవచ్చు.

– శేషగిరి, సబ్‌రిజిస్ట్రార్, షాద్‌నగర్

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

టీజేఎంయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య



సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం, యాజమాన్యం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోకపోతే సమ్మెకు దిగుతామని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య హెచ్చరించారు. పట్టణంలోని డిపో ఆవరణలో శుక్రవారం టీజేఎంయూ ఆధ్వర్యంలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాములయ్య మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏడు నెలలుగా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి, యాజమాన్యానికి వినతులు ఇచ్చినా ఫలితం లేదని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేసి గుర్తింపు సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించి కొత్త అలవెన్సులు అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి సిబ్బందిపై అధిక పనిభారం తగ్గించాలని, ఎంటీ డబ్ల్యూ యాక్టు అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని, ప్రస్తుతం కన్సాలిడేటెడ్ పే కింద పని చేస్తున్న వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 2019 సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తి వేయాలన్నారు. పీఎఫ్, సీసీఎస్ నుంచి యాజమాన్యం వాడుకున్న డబ్బులను వడ్డీతో సహా తిరిగి చెల్లించాలన్నారు. ఉద్యోగులందరికీ మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఈనెల 7 నుంచి సమ్మెకు దిగుతామని వెల్లడించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నర్సింలు, ధన్‌సింగ్, టీపీ రెడ్డి, స్వామి, మల్లయ్య, పర్వతాలు, శ్యామల, ఆంజనేయులు, టాకేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి రూ.11లక్షల విరాళం


చెక్కును అందజేస్తున్న వ్యాపారవేత్తలు

షాద్‌నగర్: దాతల సహకారంతో షాద్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి వ్యాపారవేత్తలు, రవి ఫ్రూట్స్ సంస్థ వారు భారీ విరాళం అందజేశారు. ఈ మేరకు వారు శుక్రవారం రూ.11లక్షల చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవి ఫ్రూట్స్ సంస్థ అధినేతలు రవికుమార్ అగర్వాల్, కేదార్‌నాథ్ అగర్వాల్, రాజేందర్‌కుమార్ అగర్వాల్ ఎమ్మెల్యేను కలిసిన రవికుమార్ అగర్వాల్ విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు.

సీడ్స్ షాప్‌లో నకిలీ మందుల విక్రయం

యజమానిపై కేసు

షాబాద్: నకిలీ మందులు విక్రయిస్తున్న న్యూ మారుతి సీడ్స్ దుకాణం పై కేసు నమోదయింది. ఈ ఘటన శుక్రవారం షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నాగర్‌గూడలో ఉన్న న్యూ మారుతి సీడ్స్ షాపులో సింజెంట కంపెనీకి చెందిన నకిలీ మందులు విక్రయిస్తున్నారని సదరు కంపెనీ మేనేజర్ కేషమసుధీర్‌కు సమాచారం అందింది. దీంతో అతడు అదే కంపెనీలో పనిచేసే రాకేశ్‌తో సినోడిస్ 200 మి.లీల మందు కొనుగోలు చేయించాడు. సదురు మందు డబ్బాపై ఉన్న లోగోలు వేరుగా ఉన్నట్లు గమనించి అది నకిలీదని గుర్తించారు. షాపు యజమాని రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సింజెంట కంపెనీ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆస్పత్రికి అల్ట్రా సౌండ్ మిషన్ అందజేత


కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఆస్పత్రి యాజమాన్యం

షాద్‌నగర్: ఐడీబీఐ బ్యాంకు ఫరూఖ్‌నగర్ బ్రాంచ్ సహకారంతో సీసీ షరాఫ్ మెమోరియల్ ఆస్పత్రికి రూ.20లక్షల విలువ చేసే ఆల్ట్రా సౌండ్ మిషన్‌తో పాటుగా వైద్య పరికరాలను శుక్రవారం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు సీజీఎం, హైదరాబాద్ జోనల్ హెడ్ జానకిరామన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సీసీ షరాఫ్ ఆస్పత్రికి ఉచితంగా ఆల్ట్రాసౌండ్ యంత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం వెంకటేష్ దేవనపల్లి, బ్యాంకు అధికారులు సందీప్‌పట్నాయక్, కవిత, నరేన్ కందుల, ఆస్పత్రి యాజమాన్యం సుకుమార్, శేషాద్రి, సోమరెడ్డి, మూర్తి, డాక్టర్ సతీష్‌చంద్ర, డాక్టర్ కిరణ్మయి, పాల్గొన్నారు.

ఒక్కొక్కరికి రెండు జతలు

- పాఠశాల ప్రారంభం నాటికే యూనిఫాంలు అందజేసేందుకు చర్యలు
- ఇప్పటికే మహిళా సమాఖ్యలకు క్లాత్ అందజేసిన అధికారులు
- తయారీలో మహిళా సంఘాల సభ్యులు
- ఒక్కో జతకు రూ.50 చెల్లించనున్న ప్రభుత్వం


మహిళా సంఘం సభ్యులకు యూనిఫాం క్లాత్ అందజేస్తున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం (జూన్12) రోజేనే విద్యార్థులకు యూనిఫాం అందించాలని భావిస్తున్న విద్యాశాఖ ఇందుకు కార్యాచరణ సైతం రూపొందించింది. ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పనిని మహిళా సమాఖ్యకు అప్పగించారు. గ్రామ మహిళా సంఘం ఆధ్వర్యంలో దుస్తులను కుట్టేందుకు ముందుకు వచ్చే మహిళలకు యూనిఫాం క్లాత్ అందిస్తున్నారు. వారు అధికారులు సూచించిన విధంగా యూనిఫాంను కుట్టి సకాలంలో మండల మహిళా సమాఖ్యకు అందించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 29న మండల మహిళా సమాఖ్యకు వచ్చిన యూనిఫాం క్లాత్‌ను ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి గ్రామాల మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు.

సెలవులకు ముందే కొలతలు

మండల పరిధిలోని 29 గ్రామాల పరిధిలో 41 ప్రభుత్వ పాఠశాలల్లో 2,667 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1,204 మంది బాలురు, 1,463 మంది బాలికలున్నారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా ఏడాదికి రెండు జతల యూనిఫాంలను అందిస్తోంది. పాఠశాలలో ఉండే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లా అధికారులు పాఠశాలల పేరుతో వేర్వేరుగా బెల్ట్‌లు అందించారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వకముందే అయా పాఠశాల్లో గ్రామాల్లోనే మహిళా సంఘం సభ్యులు విద్యార్థుల కొలతలను తీసుకుని యూనిఫాంను కుడుతున్నారు.


విద్యార్థుల కొలతలను తీసుకుంటున్న మహిళ సంఘం సభ్యురాలు (ఫైల్)

బాల, బాలికలకు వేర్వేరు..

జిల్లా విద్యాశాఖ విద్యార్థులకు తరగతుల వారీగా వేర్వేరు యూనిఫాంలను కుట్టిస్తోంది. అందులో భాగంగా 1 నుండి 5వ తరగతి వరకు బాలురకు షర్టు, నెక్కరు, బాలికలకు 1 నుంచి 3వ తరగతి వరకు ఫ్రాక్,షర్టు, 4, 5వ తరగతి విద్యార్థినులకు షర్టు మరియు స్కర్ట్స్ ఉండేలా సెలక్షన్ చేశారు. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు షర్టు, ప్యాంట్, బాలికలకు పంజాబీ డ్రెస్, పైన వాస్కోట్‌లను ఎంపిక చేశారు. ఇందుకు గాను ఒక్క జతకు మహిళ సంఘం సభ్యులైన టైలర్లకు రూ.50కు చెల్లిస్తుంది. క్లాత్ కొలతల ప్రకారం కట్ చేయడానికి, కాజాబటన్లు, ట్రాన్స్‌పోర్టులాంటి ఖర్చులకు అదనంగా మరో రూ.25 చెల్లిస్తారు.

వేసవి సెలవుల్లో పూర్తిచేస్తాం



విద్యార్థులకు పాఠశాలలు తెరిచేలోగా యూనిఫాంలను అందించేందుకు కృషి చేస్తున్నాం. వేసవి సెలవుల్లోనే మహిళా సంఘం సభ్యుల సహకారంతో అన్ని పాఠశాలలకు ప్రభుత్వం సూచించిన సంఖ్యకు అనుగుణంగా యూనిఫాంలు అందిస్తాం.

– భగవంతు, ఏపీఎం, కేశంపేట

యువకుడి బలవన్మరణం


సంగమేశ్వర్(ఫైల్)

షాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సతీశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన జట్ట సంగమేశ్వర్(22) 15 ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. గురువారం తండ్రి నర్సింలు సంగమేశ్వర్‌ను మొయినాబాద్‌లోని భాస్కర్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి ఇంటికి తీసుకువచ్చాడు. ఫలితం లేకపోవడంతో మనోవేదనకు గురైన సంగమేశ్వర్ పొలానికి వెళ్తున్నాని చెప్పి అక్కడ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి పొలానికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందిన కుమారుడిని చూసి బోరున విలపించాడు. శుక్రవారం మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఓఆర్‌ఆర్‌పై కారు బోల్తా

యువకుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నం: అతివేగం కారణంగా కారు బోల్తాపడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఆదిబట్ల ఠాణా పరిధిలో ఓఆర్‌ఆర్‌పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. యాచారం మండలం నల్లవెల్లికి చెందిన దేరంగుల తిరుమలేశ్(35) నగరంలోని గచ్చిబౌలి నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా స్వగ్రామానికి ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో బొంగులూరు ఎగ్జిట్–12 వద్దకు రాగానే అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న తిరుమలేశ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమంగా గోవుల తరలింపు

గోశాలకు తరలించిన బీజేపీ శ్రేణులు

ఇబ్రహీంపట్నం: కంటైనర్‌లో అక్రమంగా గోవులు తరలిస్తుండగా బీజేపీ నాయకులు వాటిని గోశాలకు తరలించారు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. గురువారం రాత్రి మండల పరిధిలోని రాయపోల్ మీదుగా ఓ కంటైనర్‌లో 42 గోవులను తరలిస్తున్నారు. విషయం గమనించిన స్థానికులు మార్గ మధ్యలో వాహనాన్ని అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. గోవులను ఇరుకుగా ఉంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలుసు కుని వాహనాన్ని స్టేషన్‌కు తరలించా రు. అనంతరం బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకుని గోవులను సమీపంలోని గోశాలకు తరలించారు.

మట్టిని తరలిస్తున్న వాహనాలు సీజ్

మాడ్గుల: అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. మండల పరిధిలోని అందుగుల శివారులోని వాగు నుంచి శుక్రవారం ఉదయం అక్రమంగా మట్టి తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి డ్రైవర్లు, వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్నేహితుడిని నమ్మించి.. రూ.5.60 లక్షలు దోపిడీ


వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

ఇద్దరు నిందితులకు రిమాండ్

- వివరాలను వెల్లడించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: స్నేహితుడిని నమ్మించి, నగదు దోచుకెళ్లడంతో పాటు ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించిన నిందితులను పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని యూసుఫ్‌గూడలో నివాసం ఉంటున్న నాగేశ్వరం శ్రీధర్ సినీ డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. శివరాంపల్లికి చెందిన రొయ్యల మల్లేశ్‌తో ఇతనికి పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ పరిధి విఠ్యాల వద్ద ఓ వెంచర్‌లో ప్లాటు అమ్మకానికి ఉందని, తక్కువ ధరకే ఇప్పిస్తానని శ్రీధర్ మల్లేశ్‌కు చెప్పాడు. అనంతరం షాద్‌నగర్‌కు చెందిన చింతోజు శ్రీధర్‌ను ఫోన్‌ద్వారా పరిచయం చేశాడు. స్నేహితుడి మాటలు నమ్మిన మల్లేశ్ ప్లాటును చూసేందుకు శివరాంపల్లికి చెందిన తన స్నేహితులు రవి, రాజుతో కలిసి గత నెల 27న కారులో షాద్‌నగర్‌కు వచ్చారు. ప్లాటుకు బయానా ఇచ్చేందుకు మల్లేశ్ రూ.5.60 లక్షలు తీసుకువచ్చాడు. నాగేశ్వరం శ్రీధర్ చెప్పినట్లుగా ప్లాటును చూపించేందుకు చింతోజు శ్రీధర్ స్నేహితులు శ్రీనాథ్ శ్రీకాంత్. మల్లేశ్ పాటు అతని స్నేహితులను వెంచర్‌కు తీసుకెళ్లారు.

చంపుతామని బెదిరించి..

మల్లేశ్ కారులో డబ్బులు ఉన్న విషయాన్ని తెలుసుకున్న నాగేశ్వరం శ్రీధర్ ఎలాగైనా కాజేయాలని చింతోజు శ్రీధర్‌కు చెప్పాడు. వెంచర్ వద్ద ఎవరూ లేకపోవడంతో మల్లేశ్ కారుకు రాళ్లను అడ్డుగాపెట్టి అద్దాలు పగులగొట్టారు. మల్లేశ్, రవి, రాజుపై రాళ్లతో దాడిచేసి ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. కారులో ఉన్న రూ.5.60 లక్షల నగదు తీసుకుని పరారయ్యారు. ఈ ఘటనపై గత నెల 29న కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించి ఈనెల 1న చింతోజు శ్రీధర్, నాగేశ్వరం శ్రీధర్‌ను అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరం ఒప్పుకొన్నారు. నిందితుల నుంచి రూ.2.70 లక్షల నగదు, రెండు సెల్ ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్ఐ శివారెడ్డి, సిబ్బంది మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. వీరికి తగిన రివార్డులు అందజేస్తామని సీఐ తెలిపారు.

భవనాలు ఆకాశంలోకి.. జలాలు పాతాళంలోకి..

గ్రేటర్‌లో ఏటా పెరుగుతున్న హైరైజ్ నిర్మాణాలు

- అడుగంటుతున్న భూగర్భ నీటి మట్టాలు
- ఇష్టారీతిన అనుమతులిస్తున్న యంత్రాంగం
- కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరం
- భూమిలోకి ఇంకని వర్షపు నీరు
- శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, గండిపేట, శంషాబాద్‌లలో అట్టడుగున..



ప్రధాన మండలాల్లో భూగర్భ జలాలు (మీటర్ల లోతులో)

మండలం	డిసెంబర్	జనవరి	ఫిబ్రవరి	మార్చి
శేరిలింగంపల్లి	12.59	13.97	15.07	23.12
సరూర్‌నగర్	12.66	14.80	18.83	19.78
ఇబ్రహీంపట్నం	14.11	15.75	16.89	18.48
మహేశ్వరం	9.74	10.09	10.26	13.88
శంకర్‌పల్లి	8.45	9.77	11.31	12.86
చేవెళ్ల	9.14	10.23	10.83	12.00
మొయినాబాద్	7.87	8.76	10.02	11.91
కొత్తూరు	8.37	9.41	9.97	11.65
గండిపేట్	9.87	10.08	10.70	10.13
శంషాబాద్	8.36	8.80	9.41	9.88
రాజేంద్రనగర్	8.33	8.76	9.46	9.89
కందుకూరు	6.72	7.69	8.99	9.52



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో హైరైజ్ భవనాల ఎత్తు పెరుగుతున్న కొద్దీ.. భూగర్భ జలాలు పాతాళానికి జారుతున్నాయి. వర్షపాతం సాధారణం కంటే 20 శాతం ఎక్కువే నమోదవుతున్నా ఆ స్థాయిలో భూమిలోకి నీరు చేరడం లేదు. చాలా అపార్ట్‌మెంట్లలో బోర్లు అడుగంటిపోతున్నాయి. పశ్చిమ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో ఈ సంక్షోభం మరింత తీవ్రంగా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం గ్రేటర్ పరిధిలో గతేడాది జనవరిలో 8.13 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. ఈ ఏడాది జనవరి నాటికి 9.46కు పడిపోయాయి. గతేడాది మార్చిలో 10.89 మీటర్ల లోతుకు చేరగా.. ఈ మార్చి నాటికి ఏకంగా 11.94 మీటర్ల లోతుకు పడిపోయాయి.

హైరైజ్ అపార్ట్‌మెంట్లు.. గేటెడ్ కమ్యూనిటీలు..

కాస్మోపాలిటన్ సంస్కృతి, పట్టణీకరణ, వలసలు, ఉద్యోగావకాశాలు, అభివృద్ధి, అంతర్జాతీయ మౌలిక వసతులు, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలు.. ఇలా రకరకాల కారణాలతో గ్రేటర్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ ఏర్పడింది. దీంతో హైరైజ్ అపార్ట్‌మెంట్లు, బడా గేటెడ్ కమ్యూనిటీలు కోకొల్లలుగా వెలుస్తున్నాయి.

- 2019– 2020 మధ్యకాలంలో జీహెచ్ఎంసీ పరిధిలో 17,538 భవన నిర్మాణ అనుమతులు మంజూరు కాగా.. గత నాలుగేళ్లలో వంద శాతానికిపైగా వృద్ధి నమోదయింది. భూగర్భ జలాల వినియోగం గురించి ఏమాత్రం ఆలోచించకుండా అధికారులు ఇష్టారీతిన నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. దీంతో శేరిలింగంపల్లి, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, నానక్‌రాంగూడ వంటి పశ్చిమ హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో హైరైజ్ భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు నిర్మాణంలో ఉండటమే నీటి ఎద్దడికి ప్రధాన కారణం.
- నగరంలో దాదాపు 70 శాతం కొత్త ప్రాజెక్టులు ఈ ప్రాంతాల్లోనే నిర్మాణంలో ఉన్నాయి. డెవలపర్లు నిర్మాణం కోసం భూగర్భ జలాలపై ఆధారపడుతుంటారు. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత చాలా గేటెడ్ కమ్యూనిటీలు నీటిని ఆదా చేయడానికి వర్షపు నీటి సంరక్షణ ప్రాజెక్టులను సరైన రీతిలో నిర్వహణ చేయడం లేదు. ముందస్తు ప్రణాళికలు, ఇంకుడు గుంతలు వంటి సమగ్ర వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు డ్రైనేజీల నుంచి వృథాగా పోతోంది.

శివార్లలోనూ ఇదే దుస్థితి..

అపార్ట్‌మెంట్లలో ఇష్టారీతిన బోర్లువేయడం, గేటెడ్ కమ్యూనిటీలలో నీటి వినియోగం పెరుగుతుండటంతో ఎద్దడి ఏర్పడుతోంది. మరో వైపు ఇంకుడు గుంతలు ఏర్పాటు, వినియోగం అంతంత మాత్రంగానే ఉండటంతో భూగర్భ మట్టాలు క్రమంగా తగ్గుతున్నాయి. ఒకప్పటి శివారు ప్రాంతాలన్నీ ప్రస్తుతం నగరంలో అంతర్భాగమయ్యాయి. పంట భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. చెరువులు, కుంటలు దాదాపు కనుమరుగయ్యాయి. ఒకటి రెండు ఉన్నా..వాటి చుట్టూ భారీ నిర్మాణాలు, సీసీ రోడ్లే. పూర్తిగా కాంక్రీట్ జంగిలే. ప్రతి 25 నుంచి 50 ఫీట్ల దూరంలో ఒక బోరు బావిని తవ్వుతుండటం, సెప్టెంబర్/అక్టోబర్ మాసాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ... భూమిలోకి నీరు ఇంకకపోవడం, చెరువులు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీరు కూడా లేకపోవడంతో భూగర్భంలోని నీరు పాతాళానికి పడిపోయింది. ప్రధానంగా శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్, కొత్తూరు, శంషాబాద్, రాజేంద్రనగర్, కందుకూరు మండలాల్లో భూగర్భ మట్టాలు బాగా పడిపోయాయి.

ట్యాంకర్లే ఆధారం..

ఎండిపోయిన బోరుబావులతో నగరవాసులు అల్లాడుతున్నారు. కొంతమంది పరిమిత స్థాయిలో సరఫరా అయ్యే వాటర్ బోర్డు నీటితో సరిపెట్టుకుంటుంటే.. మరికొందరు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌ల వైపు మొగ్గు చూపిస్తుంటే.. ఇంకొందరు ప్రైవేట్ ట్యాంకర్లకు భారీ చార్జీలు చెల్లిస్తున్నారు. నెలకు నీటి ట్యాంకర్ల ధర రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకు ఉంటోంది. వేసవికాలంలో వంట చేయడం, స్నానం చేయడం, బట్టలు ఉతకడం కూడా ఇప్పుడు విలాసంగా మారిందని నార్సింగిలోని ఓ బడా గేటెడ్ కమ్యూనిటీకి చెందిన వ్యాపారవేత్త అన్నారు. కమ్యూనిటీలో వర్షపు నీటి నిల్వ వ్యవస్థ పూర్తిగా ఎండిపోయిందని కొన్నిసార్లు తాగునీటి సరఫరా చాలా ప్రమాదకరంగా ఉందన్నారు.